# పాముల నాగేశ్వరావు

**''గణపతి నవరాత్రులు పందిట్లోకి నాగేశ్వర్రావు వస్తున్నాడు'' అనేసి ఒకటే చెప్పుకోడం. అసలా నాగేశ్వర్రావుని ఎదురుగా చూస్తే ఎలాగుంటాడో అని ఒకటే ఉబలాటం అందరికీ.**

**బాగా పొద్దోయింది.**

**పాత అంబాసిడరు కారు ఊరి ఎర్రకంకర రోడ్ల మీంచొస్తుంటే జనం ఒకటే కేకలు ఒకటే అరుపులు.**

నవరాత్రి పందిట్లో ఆగిన కార్లోంచి దిగిన రికార్డింగ్ డేన్సరు నాగేశ్వర్రావు సినిమా యాక్టరు నాగేశ్వర్రావులా లేడు. ఎవరికి వాళ్ళు ''ఏదో అనుకున్నాం ఈడెవర్రా?'' అన్నారు.

''నిజంగా నాగ్గోడి డబుల్‌ఫొటో అనుకున్నాం గదా'' అని ఒకళ్ళు ''అసలు నాగేశ్వర్రావు పోలికలు ఈళ్ళందరికీ ఎక్కడొస్తాయి'' అని ఇంకొకళ్ళు ఇలా తలో విధంగా అనుకున్నారు. కొందరయితే వాళ్ళ వూళ్ళెళ్ళిపోయేరు.

''ఎలాగా వచ్చేం గాబట్టి ప్రోగ్రాం చూసెల్దాం'' అని ఉండిపోయేరు ఇంకొందరు.

రాత్రి పదయ్యింది.

చీకటిగా ఉన్న స్టేజి మీద ఒక్కసారిగా వెలిగినియ్యి లైట్లు. జనం మధ్యలో ఉన్న ఒకడు కలరు వీల్ తిప్పుతుంటే వెనకనించి గిల్లికజ్జాలూ రికార్డు వినిపిస్తుంది.

తెర వెనకనించి ఒక్కసారిగా స్టేజీమీదికి దూకి వినబడే ఆ పాటతో పెదాలు కలుపుతా పాడ్తూ అచ్చం అక్కినేని నాగేశ్వర్రావులాగ డేన్సు చేస్తున్న ఆ మనిషిని చూసి ''అయ్యబాబోయ్ ఇదేంటది? అచ్చం నాగేశ్వర్రావే'' అనుకున్నారు.


ఇరవై అడుగుల దూరంనించి చూస్తే అచ్చం అక్కినేని నాగేశ్వర్రావులాగే ఉన్నాడు. అదే నడక అవే స్టెప్పు. కోటాగొట్టుకుంటే ఇంత మార్చొచ్చేస్తదా చూస్తున్న వాళ్ళకి మతులు పోయినియ్యి.

పూలరంగడు సినేమాలో నీ జిలుగు పైట నీడలోన నిలవనీ నన్ను నిలవనీ...గుండమ్మకథలో ప్రేమయాత్రలకి బృందావనమూ నందనవనమూ ఏలనో... మూగమనసులు సినేమాలో గౌరమ్మా నీ మొగుడెవరమ్మా..దసరా బుల్లోడులో పచ్చగడ్డి కోసేటి పడచు పిల్లా... ఇలా పాట మీద పాట, డేన్సు మీద డేన్సు. పాటకీ పాటకీ మధ్య చదివింపులు ఫలానా సినేమాలో ఫలానా పాట వేయించమని అడగడం.

కేకలు ఈలలు గోలలు రాత్రి రెండయ్యింది ప్రోగ్రాం అయ్యేటప్పటికి.


ఆ తర్వాత నాగేశ్వర్రావు మీద జనం విరగబడి పోతుంటే చింతా అప్పారెడ్డిగారు పాలేళ్ళతో ఆ జనాన్ని సర్దించి వాళ్ళింట్లోకి తీసుకెళ్ళి రకరకాల మాంసం కూరల్తో భోజనాలు పెట్టేరు.

నాగేశ్వర్రావుకి మా వూళ్ళోనే గాదు. ఏ ఊళ్ళో అయినా గొప్పగా చదివింపులు చదివిస్తారు. ప్రోగ్రాం అయ్యేకా భోజనాలు పెడతారు.



అసలు శ్రీరామనవమి, గణపతి నవరాత్రులూ, దేవీ నవరాత్రులూ వచ్చేయంటే నాగేశ్వర్రావుకీ అతని ట్రూపుకీ క్షణం కాళీ వుండదు. ఒకటే బుకింగులు. వరస బుకింగులు.

పందొమ్మిది వందల ఏభై తొమ్మిదీ అరవై మధ్యలో ఈ రికార్డింగ్ డేన్సు అన్నది కనిపెట్టింది ఈ నాగేశ్వర్రావే. ఇంతకు ముందు ఈ డేన్సు ఎరగని జనం పెర్రిగా చూడ్డం మొదలెట్టేరు. పోను పోను ఎలా తయారైందంటే నాగేశ్వర్రావు ప్రోగ్రాం లేని నవరాత్రుల పందిరి వెలిసిపోయిన పందిరయిపోయింది.



ఇలాగ అరవైనించి డభ్భైదాకా మహారాజభోగం అనుభవించేడు నాగేశ్వర్రావు. మారాజులా ఏలేడు నాగేశ్వర్రావు.

అయితే,

నాగేశ్వర్రావుని చూసి తయారైపోయిన వేల్పూరు వీర్రాజు రాజమండ్రీ ఉదయకుమారూ, చక్రవర్తీ, రాంబాబూ, అశోక్‌కుమారూ అతన్ని మించి పోయేరు. పోటీ బాగా పెరిగిపోయింది. వయసు పైబడ్తున్న ఈ నాగేశ్వర్రావు ఇక వెనకబడిపోతాడేమో అని జనం అనుకుంటుండగా తన ప్రోగ్రాం చివర్లో ఒక గమ్మత్తు చెయ్యడం మొదలెట్టేడు నాగేశ్వర్రావు. అదేంటంటే నాగస్వరం రికార్డేయించి పాముల్తో ఆడించడం, పాముల్తో

బొట్టు పెట్టించుకోవడం, (విషం తీసేసిన) పాముల్తో కరిపించుకోడం లాంటివి చేసేవాడు. నోట్లోంచి నురగలు కక్కుతా సోడా కడుక్కుని నటిస్తుంటే మళ్ళీ ఎగబడి చూడ్డం మొదలెట్టిన జనం నాగేశ్వర్రావుని పాముల నాగేశ్వర్రావు అని పిలవడం మొదలెట్టేరు.

నాగేశ్వర్రావుకి కొడుకు పుట్టేడు.

విచిత్రం.

ఆ కుర్రోడి కళ్ళు అచ్చం పాముకళ్ళే. ఆ కళ్ళతో ఆకాశంలోకి చూడ్డం, నాలికని పాము నాలిక లాగ బయటికి తీసి ఆడిస్తా ఉండే ఆ కుర్రోడు ఓ రోజు చచ్చిపోయేడు. తాగిన మత్తులో ఉన్న నాగేశ్వర్రావు పాముల్ని నానాహింసలూ పెట్టడం వల్లే అలాంటికొడుకు పుట్టేడనీ అర్ధాంతరంగా చచ్చిపోయేడని చెప్పుకోవడం మొదలెట్టేరు జనం.

నాగేశ్వర్రావుకి అనుమిల్లిరాము అని పాములు పట్టే శిష్యుడు ఒకడుండేవాడు. నాగేశ్వర్రావుతో పాటే ప్రోగ్రాములకి తిరుగుతా ఉండే అనుమిల్లిరాము ఆ ట్రూపులో పాముల నాగేశ్వర్రావుతో పాటు ఆడే సాయిరాధని ఇష్టపడ్డాడు. ఆ పిల్లని పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. ఆ ఆడమనిషికోసం చాలా తాపత్రయం పడ్డాడు అనుమిల్లి రాము.

అంతకు ముందునించే నాగేశ్వర్రావుని ఇష్టపడుతున్న సాయిరాధ ఒకరోజు అనుమిల్లిరాము తనని పెడుతున్న ఇబ్బందులు గురించి చెప్పేసరికి ఏం మాటాడని నాగేశ్వర్రావు ఆ మరుసటి వారమే సాయిరాధని పెళ్ళి చేసేసుకున్నాడు. దాంతో ఆ ఇద్దరి మీదా పగబట్టేడు రాము.

* * *

అసలు పసలపూడిలో దేవీ నవరాత్రులు చెయ్యడానికి కారణం చంటిబాబు వాళ్ళ నాన్న కర్రికృష్ణారెడ్డిగారు. పొద్దుట్నుంచి పొద్దోయేదాకా పాత సంతపేటలో ఉన్న బుచ్చిరాజు కిళ్ళీకొట్టు పక్కనున్న బల్లమీద గడిపేవాడు క్రిష్ణారెడ్డిగారు.

ఒక వర్షంరోజు క్రిష్ణారెడ్డిగారు మాంచిమూడ్‌లో ఉన్నప్పుడు "ఏవండి రెడ్డిగారూ ఈ ఏడాది మన సెంటర్లో దేవీని నిలబెడదావండి" అన్నాడు బుచ్చిరాజు.

అదోలాగ నవ్వేసిన క్రిష్ణారెడ్డిగారు "నిలబెట్టడంతో అయిపోద్దేట్రా... ఆ తర్వాత నవరాత్రి ప్రోగ్రామ్సుల సంగతెవడు జూస్తాడు. పెట్టుబడి సంగతొదిలెయ్ రాజమండ్రిలో ఉండే ఆ నాటకాలోళ్ళని వాకబు చేసేవోడెవడు ఆనక ఆ వచ్చినోళ్ళకి తిండీ ఆ తర్వాత పడుకోవడానికి ఇళ్ళు ఇచ్చేవోడెవడు. ఈ ఎదవగోలంతా ఎవడు పడతాడెహె" అన్నాడు.

"పడ్డానికి మేం ఉన్నాంగాస్లెండీ... నాలుగు గుంజులు పాతి పైన నాలుగు కొబ్బరాకులేసి పందిరేస్తాం. మీ చేత్తో చిన్న దేవీఫొటో పెట్టి రెండు పారిజాతం పూలు జల్లండి చాలు తర్వాత పన్లు మేం జూసుకుంటాం" అన్నాడు బుచ్చిరాజు. "ఈడు చెప్పేది బానే ఉంది" అన్నాడు కర్రి లచ్చారెడ్డిగారు. "అవును చాలా బాగా అన్నాడు" అన్నారు రిక్షాలో రాంపురం వెళ్తా ఆగిన పిలరెడ్డిగారు. వాళ్ళంతా అలా అనేసరికి "సరే...అలాక్కా నిచ్చెయ్యండి" అన్నాడు కర్రిక్రిష్ణారెడ్డిగారు.

ఆవేళ దేవీ నవరాత్రులు మొదటిరోజు. క్రిష్ణారెడ్డిగారి ఆధ్వర్యంలో దేవీని నిలబెట్టేసేరు.

అదేరోజు దుప్పలపూడి నించి గాజుల మల్లారంవాడొచ్చేడు. గాజులమ్మడమే గాకండా హరికథలుకూడా చెపుతాడట ఆ గాజులమల్లారం. ఆ విషయం కిళ్ళీకొట్టు బుచ్చిరాజు చెవిన పడింది. వాడ్ని పిల్చిన బుచ్చిరాజు "ఏంటీ రాత్రి పని?" అనడిగేడు.

''ఏముంది బాబూ గాజులమ్ముకుని సాయంత్రం బస్సెక్కి అనపర్తిలో దిగి అక్కడ్నించి మా దుప్పలపూడి నడిచెళ్ళిపోడమే'' అన్నాడు వాడు.

''నువ్వు హరికథలు చెపుతావంటగదా? ఈరాత్రి మా పందిట్లో హరికత చెప్పాలి ఏమాత్రం పుచ్చుకుంటావ్?'' అన్నాడు.

''అన్నం పెట్టి ఓ అయిదురూపాయిలిప్పించండి'' అన్నాడు గాజులమల్లారం.

''రాత్రికి కథ బాగా చెప్పు. అన్నం పెట్టడమేగాదు దానికి ముందు కొంచెం పోయించి ఓ పదిప్పిస్తాను'' అన్నాడు బుచ్చిరాజు.

''సరే'' అన్నాడు గాజులమల్లారం.

రాత్రయ్యింది.

గాజులమల్లారం వచ్చి హరికథ చెప్పేడు.

మర్నాడు పొద్దుట్ట ఊళ్ళో అంతా కర్రిక్రిష్ణారెడ్డిగారు నిలబెట్టిన దేవీ పందిట్లో ''అన్నం పెట్టి హరికథ చెప్పించుకున్నారట ఆడెవడ్తోనో'' అని చెప్పుకున్నారు.

అది క్రిష్ణారెడ్డిగారి చెవిని కూడా పడింది. చాలా కోప్పడిపోయిన రెడ్డిగారు దూసుకుంటూ వచ్చి బుచ్చిరాజుని కొట్టేనంత పనిజేసి ''నా పరువు తీస్తార్రా... పెట్టించు అర్జంటుగా అరడజను మంచి మంచి ప్రోగ్రాముసులు''అని గొడవ చేసేడు.

* * *

పసలపూడిలో ప్రోగ్రామివ్వడానికి బస్సులో బయల్దేరింది ట్రూపంతా.

రావులపాలెం జంక్షన్లో బాగా తాగేసిన అనుమిల్లిరాము సాయిరాథ గురించి గొడవ పెట్టుకున్నాడు పాముల నాగేశ్వర్రావుతో.

''ఎక్కువ వాగితే చంపేస్తాను'' అన్నాడు నాగేశ్వర్రావు.

''అలాగే చూద్దాం'' అన్నాడు రాము.

మాటా మాటా పెరిగింది.

చాలా పెద్ద గొడవే అయ్యింది.

అప్పటికి బస్సు రావులపాలెం బ్రిడ్జి మీంచెళ్తుంది. కోపంతో రెచ్చిపోయిన అనుమిల్లిరాము పాములబుట్టని బస్సు కిటికీలోంచి గోదాట్లోకి విసిరేసేడు.

పాములనాగేశ్వర్రావు రికార్డింగ్ డాన్స్ప్రోగ్రాం లాస్టులో పాము డాన్సు అని చుట్టుపక్కల ఊళ్ళలో చాటింపు వెయ్యడంతో బళ్ళు గట్టుకుదిగిపోయేరు జనం. పాత సంతపేటలో అంతమంది జనాన్ని అంతకు ముందెప్పుడూ చూసి ఎరగం.

ఊళ్ళోకి దిగిన నాగేశ్వర్రావు మీద విరగబడి చూస్తున్నారు. వాళ్ళందర్నీ చూసిన బుల్లిరెడ్డి మేష్టారు ''ఏంటి వీళ్ళ పిచ్చి?'' అన్నారు చింతా పెదకాపుగారితో, వాళ్ళ కిచ్చిన ఇంట్లోకి దిగిన ట్రూపోళ్ళంతా కోటాలు కొట్టుకుంటున్నారు.

ఓ నిబ్బు బిగించేసిన నాగేశ్వర్రావుకి గుర్తుకొచ్చింది. ఈ పందిట్లో ప్రోగ్రాములు జరిపించేవాళ్ళని పిలవమన్నాడు తన ట్రూపుతో కుర్రోడితో.

ఏంటని వచ్చిన కర్రి క్రిష్ణారెడ్డి గారితో "నమస్కారం రెడ్డిగారూ! ...మా అనుమిల్లిరాముగాడికి మందెక్కువయ్యి పాములబుట్టని గోదాట్లో పారేసేడు కాబట్టి. ఇవాళ ప్రోగ్రాములో పాముల అయిటమ్ ఉండదండి" అన్నాడు.

క్రిష్ణారెడ్డిగారి వెనకాలున్న వాళ్ళంతా కంగారు పడిపోయేరు. "అసలు నీ ప్రోగ్రాములో అదేగదా స్పెషలు అయిటమ్. దాన్ని చూడ్డానికి ఎక్కడెక్కడినించో వచ్చేసేరు జనం. అది లేకపోతే చాలా గొడవ చేసేస్తారు ఎదవలు. ఇదిగో నాగేశ్వర్రావుగారు అసలు కుదరదంటే... కదరదు పాము డేన్సు ఉండాల్సిందే" అన్నారు.

మందు దిగిపోయి ఆ గదిలో ఒక మూల పడుకునున్న అనుమిల్లిరాముని లేపి "ఏం చేద్దాం రా" అనడిగేడు పాముల నాగేశ్వర్రావు.

మొకం గోడకేసి తిప్పుకుని కాస్సేపు ఆలోచించిన అనుమిల్లిరాము "ఏ సాయిబులు దగ్గర్నుంచన్నా మామూలు పాములు తెప్పించు విషం తీసిస్తాను" అన్నాడు.

"సరే" అనుకుని క్రిష్ణారెడ్డితో "ఊళ్ళో పాములాడించే సాయిబులెవరన్నా ఉంటే వాళ్ళ పాములు తెప్పించండి" అన్నాడు నాగేశ్వర్రావు.

పందిట్లో కొంతమంది కుర్రోళ్ళని పిల్చిన క్రిష్ణారెడ్డిగారు పాముల్ని సంపాయించే పని అప్పగించేరు వాళ్ళకి.

పాముల గురించి వూరంతా వెదికారు కుర్రోళ్ళు.

ఎక్కడా పాములోళ్ళు దొరకలేదు వాళ్ళకి. చివరికి యర్రమిల్లి చినెంకట్రాజుడాబా మేడ వెనకాలున్న పాములుపట్టే వాళ్ళ ఇంటికెళ్ళి "ఏరా నాగరాజు ఇవ్వేళ పాములేమన్నా పట్టారా" అనడిగారు.

ఆ మధ్యాహ్నమే కర్రి వెంకయ్యగారి మేనల్లుడు రామరాజుగారింట్లో పిడకల గూట్లో మూడు పాముల్ని, మైకుసెట్టు గోపాలం గారింట్లో మూడు పాముల్ని పట్టిన నాగరాజు వాటిని కుర్రోళ్ళ కిచ్చేసరికి వాళ్ళు అనుమిల్లిరాముకిచ్చేరు.

అయితే ముందే ఆలోచించి ప్లానేసుకుని ఉన్న అనుమిల్లి రాము ఆ పాములకి విషం తియ్యకండా పట్టుకెళ్ళి నాగేశ్వర్రావు కిచ్చేడు.

పాములు దొరికాయి. ప్రోగ్రాం సక్సెస్ అనుకున్నారు కర్రి క్రిష్ణారెడ్డిగారూ, బుచ్చిరాజూ ఇంకా పందిట్లో కుర్రోళ్ళు.

మళ్ళీ ఓ నిబ్బు బిగించిన నాగేశ్వర్రావు తన దగ్గరున్న పాముల్ని ఆడించినట్టు చాలా హుషారుగా ఈ పాముల్నీ ఆడించి ముఖం మీద గుండెలమీద పెట్టుకుని తిప్పడం ఇష్టానికి వాటిని మెలిపెట్టడం లాంటివి చేస్తుంటే ఒక కోడి త్రాచు నాగేశ్వర్రావు మూతిమీద ఫట్‌మని కొట్టింది.

అంతే,

స్టేజిమీద వెల్లకిలా పడిపోయిన నాగేశ్వర్రావు అరుస్తున్నాడు. గిలగిల్లాడుతున్నాడు నోట్లోంచి నురుగలొచ్చేస్తున్నాయి చూస్తున్న జనం భలేగుందిరా యాక్షను తెగ చప్పట్లు కొట్టేస్తున్నారు. పెద్ద ఈలలేస్తూ గోల చేసేస్తున్నారు. ట్రూపులో వాళ్ళు ఇవేళేంటి యాక్షను ఇంత బాగా చేస్తున్నాడు అని షాకయిపోతున్నారు.

కాస్సేపటికి శరీరమంతా నీలంగా మారిపోయింది.

ఆస్టేజీమీదే ప్రాణాలొదిలేసేడు పాముల నాగేశ్వర్రావు.

* * *